




నకిలీ హాజరు..!

- ముఖ హాజరులో హైటెక్ అక్రమాలు ● వైద్య సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ ట్యాంపరింగ్ ● ఐఫోన్‌లో తప్పుడు హాజరు.. గుర్తించిన ఉన్నతాధికారులు ● జిల్లా వ్యాప్తంగా ఏడుగురికి షోకాజ్ నోటీసులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకువచ్చిన ముఖ హాజరు గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) అభాసుపాలవుతోంది. ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తే వైద్యాధికారులు ఐఫోన్ ద్వారా ముఖ హాజరును ట్యాంపరింగ్ చేసినట్లు నిర్ధారణ జరిగింది. జిల్లాలోని కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్లలో, పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు కొందరు ఐఫోన్ ద్వారా ముఖ హాజరును ట్యాంపరింగ్ చేసినట్లు వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఐదు రోజుల క్రితం జిల్లాలోని ఏడుగురు వైద్యసిబ్బంది ఐఫోన్‌తో ట్యాంపరింగ్ చేసి ఎఫ్ఆర్ఎస్ వేసినట్లు గుర్తించారు. ఐఫోన్‌లో ట్యాంపరింగ్ చేసి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు రాకుండానే తప్పుడు హాజరును నమోదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి వారిపై నిఘా ఉంచిన వైద్యశాఖ ఉన్నతాధికారులు కర్నూలు జిల్లాలో ఏడుగురు ఉద్యోగులను గుర్తించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేసే వైద్యాధికారులు, ఇతర ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి చేసింది. అందుకోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించింది. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ముఖ హాజరు వేస్తే సమయం, తేదీ, ఎక్కడ వేశారు అనేది నమోదవుతుంది. ఈ విధానం రాష్ట్ర వ్యాప్తంగా అమలు అవుతోంది. అయితే ఎక్కువమంది వైద్యాధికారులు, సిబ్బంది ఐఫోన్లను వినియోగిస్తున్నారు. ఆ ఫోన్ల ద్వారానే ముఖ హాజరు వేస్తున్నారు.



కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

ఏడుగురికి నోటీసులు



వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల సిఫార్సుల మేరకు జిల్లాలో తప్పుడు హాజరు నమోదు చేసిన ఏడుగురు వైద్యులు, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. వారు ఇచ్చిన వివరణను ప్రభుత్వానికి నివేదిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్ఓ, కర్నూలు

ఉద్యోగుల్లో ఆందోళన

జిల్లాలోని పలు అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో ఐఫోన్ ద్వారా ముఖహాజరు ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారు. నన్నూరు పీహెచ్‌సీలో ఓ స్టాఫ్ నర్సు రెండు సార్లు, పత్తికొండలో ఓ డాక్టర్ ఒకసారి, ఎర్రబురుజు అర్బన్ హెల్త్ సెంటరులో ఓ మెడికల్ ఆఫీసర్, ఓ ఫార్మాసిస్టు గ్రేడ్-2, బండిమెట్ట అర్బన్ హెల్త్ సెంటరులో స్టాఫ్ నర్సు ఒక్కోసారి ఐఫోన్‌లో ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. పుచ్చకాయమడ పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు 3 సార్లు ఐఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ వేయడం గమనార్హం. అయితే రాష్ట్ర స్థాయిలో ఎఫ్ఆర్ఎస్ నమోదు అక్రమాలను గుర్తించడంతో వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఐఫోన్‌లో ట్యాంపరింగ్ చేసిన ఎఫ్ఆర్ఎస్ వేసిన ముగ్గురు మెడికల్ ఆఫీసర్ల వివరాలు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు, ముగ్గురు స్టాఫ్ నర్సుల వివరాలు కడప ఆర్‌డీకి, ఫార్మాసిస్టు వివరాలు డీఎంహెచ్‌ఓకు పంపించారు.

ఎప్పుడొచ్చినా అదే సమయం..!

వైద్యశాఖలో కొందరు సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లకు ఎన్ని గంటలకు వెళ్లినా వారి వద్ద ఉన్న ఐఫోన్‌లో సమయం ఏ విధంగా నమోదు చేసుకుని ఉంటారో ఆ విధంగానే ముఖ హాజరు తీసుకుంటుంది. ఉదాహరణకు ఓ ఉద్యోగి ఉదయం 9:30 గంటలకు వైద్యశాలకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఆ ఉద్యోగి ఉదయం 11 గంటలకు వెళ్లి ఐఫోన్‌లో టైమింగ్ సెట్టింగ్ ద్వారా ముఖ హాజరు వేసినా ఉదయం 9:30 గంటలకు హాజరైనట్లు నమోదవుతుంది. ఈ విషయాన్ని వైద్యఆరోగ్యశాఖలో ఉన్నతాధికారులు సాంకేతిక పరిజ్ఞానం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలన చేసి ప్రస్తుతం ఆ విధంగా ట్యాంపరింగ్ చేసిన వైద్యాధికారులు 185 మంది మరో 13వేల మంది పారామెడికల్ సిబ్బంది ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ వైద్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



క్షమా గుణమే క్రీస్తు మార్గం

నేడు గుడ్‌ఫ్రైడే.. చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు



కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దయ, క్షమాగుణం మానవ జాతి మనుగడకు ఏకైక మార్గమని ప్రబోధించిన నవయుగ కర్త క్రీస్తు ప్రభువు. సమస్త మానవాళి చేసిన పాపాల ప్రాయశ్చిత్తం కోసం ఆయన శిలువపై ప్రాణాలు అర్పించాడు. తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచాడు. పొరుగువారిని ప్రేమించాలని, వారి తప్పులను క్షమించాలని బోధించాడు. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం శిలువ వేయబడ్డారు. ఆ రోజును గుడ్ ఫ్రైడే జరుపుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులు 'గుడ్‌ఫ్రై డే' వేడుకను నిర్వహించుకోడానికి సిద్ధమయ్యారు. దయామయుని తలుస్తూ ఉపవాసం, ప్రార్థనలతో గడుపనున్నారు. ఈ సందర్భంగా అన్ని చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. మత పెద్దలు గుడ్‌ఫ్రై డే సందేశాన్ని అందించనున్నారు.

నగరంలో గుడ్ ఫ్రై డే ప్రార్థనలు...

నగరంలోని సీఎస్ఐ చర్చి, కోల్స్ సెంటినియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, రాక్‌వుడ్ చర్చి, స్టాంటన్ చర్చి, ప్రార్థన మందిరం, హోసన్న మందిరం, బిషప్ చర్చిలతోపాటు వివిధ ప్రాంతాల్లోని చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రై డే ప్రార్థనలు నిర్వహిస్తారు.

పవిత్ర దినం

యేసుక్రీస్తును శిలువ వేసిన జ్ఞాపకార్థంగా గుడ్‌ఫ్రై డే రోజున అందరూ చర్చీలకు వెళ్తారు. పాస్టర్లు సందేశాలు అందిస్తారు. యేసు త్యాగం కారణంగా ప్రజలు విముక్తి పొందారని, మరణం తర్వాత స్వర్గానికి చేరుకోవచ్చని భక్తులు నమ్ముతారు. యేసుక్రీస్తు మానవుల పాప పరిహారార్థమే శిలువను మోశారని భక్తుల నమ్మకం. మానవులు చేసిన అన్ని పాపాలకు ఆయన త్యాగం, క్షమాగుణమే సమాధానంగా నిలుస్తుంది.

ప్రగతి కార్డులను అందజేయండి

- జిల్లా వ్యాప్తంగా పైతరగతులకు 4,21,632 మంది విద్యార్థులు
- జాయింట్ కలెక్టర్ బి. నవ్య



కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను ఈనెల 21వ తేదీ నాటికి అందించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశించారు. గురువారం పాఠశాలల ముగింపునకు సంబంధించి వెబ్ ఎక్స్ ద్వారా విద్యాశాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులకు మార్కులతో కూడిన ప్రగతి కార్డులను 21వ తేదీ నాటికి అందించి ఆన్‌లైన్‌లో నమోదు పూర్తిచేయాలన్నారు. పైతరగతులకు చేర్చే ప్రక్రియ పూర్తిచేసి సోమవారం కొత్త తరగతుల్లో కూర్చునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,21,632 మంది విద్యార్థులు పై తరగతులకు వెళ్తున్నందున వారందరికీ స్కూల్ ప్రత్యేకతలను తెలియజేయాలన్నారు. 1,886 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని ప్రాథమిక విద్యలోకి చేరుతున్న వారందరినీ పాఠశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై సీఎస్ సమీక్ష: వేసవిలోని జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశంలో మాట్లాడుతూ కరువు ప్రభావిత మండలాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలన్నారు.

రహదారులను పూర్తి చేస్తాం

- తారు రోడ్డు, కల్వర్టులకు రూ.35 కోట్లు
- ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి

మద్దికెర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దెబ్బతినిపోయిన రహదారుల పని పూర్తి చేస్తామని జిల్లా ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 821 కిలోమీటర్లు, 181 పనులకు గాను రూ.24 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 14 కల్వర్టులకు రూ.11 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రూ.161 పనులు మొదలు పెట్టామని, మిగతా పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. కల్వర్టులు కూడా రెండు చోట్ల పూర్తి కావడానికి వచ్చాయని తెలిపారు. జిల్లాలోని వివిధ రహదారుల ప్యాచింగ్ పనులకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. మరో రూ.4 కోట్ల విలువ చేసే కల్వర్టు పనులకు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అలాగే బురుజుల గ్రామం నుండి మద్దికెర వరకు రూ.5 కోట్లతో తారోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ శివరుద్ర, ఏఈ సునీల్, జడ్పీటీసీ సభ్యులు డి. మురళీధర్ రెడ్డి, పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ మహేశ్వరరెడ్డి

ఎల్లెల్సీకి నీరు నిలిపివేత

హాలహర్వి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీకి విడుదలవుతున్న నీటిని నిలిపివేసినట్లు బోర్డ్ అధికారులు తెలిపారు. గురువారం జలాశయంలో నీటి నిలిపివేయడంతో ఎల్లెల్సీలో పూర్తిస్థాయిలో నీటి మట్టం తగ్గిపోయింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించారు. రెండు పంటలకు సాగు నీటితో పాటు కర్నూలు జిల్లాకు చెందిన 110 గ్రామాలకు తాగునీరు ఇవ్వడంతో పాటు తాగునీటి జలాశయాలకు సైతం పూర్తి స్థాయిలో నింపారు. దీంతో ఈసారి వేసవిలో తాగునీటి సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు. ఎల్లెల్సీలో పూర్తిస్థాయిలో నీటిమట్టం తగ్గిపోవడంతో గతంలో అర్ధాంతరంగా మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికి బోర్డు అధికారులు సిద్ధమయ్యారు.



నీరు నిలిచిపోయిన ఎల్లెల్సీ

వేదవతిని పట్టించుకోని పాలకులు

24న ఆలూరులో మహా ధర్నా

ఆలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేదవతి ప్రాజెక్టును పాలకులు, ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని వేదవతి ప్రాజెక్ట్ సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. గురువారం ఆలూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కలిగి సారవంతమైన నల్లరేగడి భూములు కలిగిన హాలహర్వి, ఆలూరు, హొళగుంద, చిప్పగిరి, ఆదోని మరియు కౌతాళం మండలాలకు ప్రధానంగా తాగునీటితో పాటు, 80వేల ఎకరాలకు సాగునీరు అందించే రూ.2వేల కోట్ల అంచనాతో మంజూరైన వేదవతి ప్రాజెక్టు నిధులు లేక ముందుకు సాగడం లేదన్నారు. కేటాయింపుల ప్రకారం 8 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా ఆలుగు నిర్మాణంపై దృష్టి సారించి సుమారు 80వేల ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీరు అన్ని గ్రామాలకు అందేలా చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో ఈనెల 24న ఆలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట 2వేల మంది రైతులతో మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ డెమోక్రసీ నాయకులు సవరప్ప, రైతు సంఘం నాయకులు రాఘవేంద్రరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరులు, తిమ్మప్ప, దుబ్బలింగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేదవతి ప్రాజెక్ట్ సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణరెడ్డి

టీటీడీపై అసత్య ప్రచారాలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీటీడీకి చెందిన గోశాలలో ఆవుల మరణాలపై వైసీపీ నేత, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో శ్రీవారి మూలవిరాట్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయన మళ్లీ ఇప్పుడు ఇలాంటి దుష్ప్రచారాలకు తెరతీస్తున్నాడన్నారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన కుట్రలు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కరుణాకర్‌రెడ్డి మత విద్వేషాలు రెచ్చగొడుతూ, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కామెంట్స్ చేయడంపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తిక్కారెడ్డి డిమాండ్ చేశారు.



ఫ్రైడే..!



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గురువారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గోస్పాడు మండలంలో అత్యధికంగా 41.71 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది. మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో 41.5 డిగ్రీలు, సంజామల మండలం పేరుసోములలో 41.47, పాణ్యం మండలం గోనవరంలో 41.22, అవుకులో 41.12, దొర్నిపాడులో 41.1, నందవరంలో 41.04, డోన్‌లో 40.94, చాగలమర్రి మండలం ముత్యాలపాడులో 40.89, పాణ్యం మండలం అనుపూరులో 40.79, నంద్యాలలో 40.48 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే కర్నూలు నగరంలో 41.21 డిగ్రీల సెల్సియస్, కోడుమూరులో 40.29, మంత్రాలయంలో 40.09, సి.బెళగల్ 39.79, కల్లూరు 39.55 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పుష్పాలంకరణలో బృందావనం



పుష్పాలంకృత రాఘవరాయడి బృందావనం

మంత్రాలయం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో గురువారం మూల బృందావనానికి బంగారు కవచం, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన చైత్ర చవితిని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో సుందరంగా అలంకరించారు. ఇదిలా ఉండగా గురువారం మంత్రాలయానికి భక్తులు పోటెత్తారు. దీంతో అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో రద్దీగా కనిపించింది.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి

ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొండారెడ్డి బురుజు వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారి భద్రత, నిబంధనలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు హోర్డింగులతో పాటు స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెల్మెట్‌ను వినియోగిస్తే 60 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు హుశేన్‌పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు బాబు ప్రసాద్, భాస్కర్‌రావు, ప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, తేజోమూర్తి, అబ్దుల్ గౌస్, ఆర్ఎస్ఐ హుశేన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

నిమ్మసాగు లాభసాటి





మల్లేవేములలో నిమ్మకాయలు కోస్తున్న కూలీలు

- ఎండలు పెరిగేకొద్దీ ధరలు
- మే నెలలో మరింత పెరిగే అవకాశం
- ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.4 వేలు

చాగలమర్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిమ్మకాయలకు డిమాండ్ ఉంటుంది. ప్రజలు నిమ్మరసం ఇష్టంగా తాగుతారు. షర్బత్, మజ్జిగ మొదలైన వాటిల్లో నిమ్మకాయలు ఉపయోగిస్తారు. నిమ్మలో ఎక్కువగా సి విటమిన్ ఎక్కువగా ఉండటం వల్ల వినియోగం ఎక్కువే. ప్రస్తుతం 40 కిలోల నిమ్మకాయల బస్తా రూ.2,500 నుంచి రూ4 వేలు నుంచి రూ.4,500 పలుకుతోంది. దిగుబడి తక్కువగా ఉన్నా ధరలు ఉండటంతో రైతులకు లాభసాటిగా ఉంది. నంద్యాల జిల్లాలో 597 హెక్టార్లలో నిమ్మసాగు చేశారు. ఆళ్లగడ్డ మండలంలో 11 ఎకరాలు, చాగలమర్రి మండలంలో 130 ఎకరాలు, రుద్రవరంలో 20 ఎకరాలు, శిరివెళ్లలో 10 ఎకరాలు, దొర్నిపాడులో 5 ఎకరాలు నిమ్మ సాగు చేశారు. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి నిమ్మ తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బోరుబావుల వద్ద మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. గత ఏడాది వరకు నిమ్మకాయలను వ్యాపారులు ప్రతి రోజు 300 బస్తాలను కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కడప, అనంతపురం, చిత్తూరు తదితర నగరాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం దిగుబడి తగ్గిపోవడంతో రోజు కేవలం 50 బస్తాలు మాత్రమే వస్తున్నాయి. ధరలు ఉన్న కాయలు సరిగా లేవని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.250 నుంచి రూ.300 వరకు మాత్రమే ఉన్న ఈ ధరలు ఈనెలలు అమాంతంగా పెరిగాయి. ధరలు పెరగడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు అయితే పొలాలను కౌలుకు తీసుకున్నారు. నెల క్రితం ధర లేక డీలా పడ్డ నిమ్మరైతులు ఇప్పుడు కాలం కలిసొచ్చిందని ఉన్న కాయలను కోసి విక్రయిస్తున్నారు.

రెండు కాయలు రూ.10

గ్రామాల్లో పలువురు చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై నిమ్మకాయలను విక్రయిస్తున్నారు. కాయలు లావుగా ఉంటే రెండు నిమ్మకాయలను రూ.10 వరకు విక్రయిస్తున్నారు. తోటల వద్దకు వెళ్లి రైతుల దగ్గర కొని విక్రయిస్తున్నారు.



చాగలమర్రిలో నిమ్మకాయలు విక్రయిస్తున్న మహిళ

ఈ మూడు నెలలే కీలకం

నిమ్మకాయల విక్రయానికి ఏడాదిలో మూడు నెలలే కీలకమని రైతులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పంటకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో నిమ్మకాయల ధరలకు రెక్కలు వస్తాయని రైతులు తెలిపారు. ఏడాది పొడవునా పంట దిగుబడి వచ్చినా ఆశించిన ధరలు ఉండవు. వేసవి ప్రారంభం కావడంతోనే ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది జనవరిలో ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.600 ఉండగా ఫిబ్రవరి వచ్చేసరికి ఏకంగా రూ.15,00కు పెరిగింది. మార్చిలో రూ.2,500 చేరుకుంది. ప్రస్తుతం రూ.4 వేలు నుంచి రూ.4,500 వరకు ధర ఉంటోంది. మే నెలలో మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 100 చెట్లు సాగు చేస్తే దిగుబడి 100 నుంచి 150 ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తుంది. సాధారణంగా ప్యాకెట్‌కు సైజును బట్టి 800 నుంచి 1,200 నిమ్మకాయలను లోడ్ చేస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలో పండే నిమ్మకాయలు నాణ్యతగా ఉండటంతో ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఈ ప్రాంతంలో పండిన నిమ్మకాయలను బెంగుళూరు, గోవా, ముంబాయి, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ధరలు ఆశాజనకంగా ఉన్నాయి



నిమ్మకాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మల్లేవేముల గ్రామంలో రెండున్నర ఎకరా నిమ్మతోటను కౌలుకు తీసుకొని నిమ్మసాగు చేస్తున్నా. ధరలు బాగున్నా కాయలు పలుచగా ఉన్నాయి. కోత కోసిన కాయలను చాగలమర్రి నుంచి ముంబాయికి ఎగుమతి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉంది. శ్రీను, కౌలు రైతు



పొలంలో కుప్పగా పోసిన నిమ్మకాయలు

పొలాలపై డ్రోన్లు

ఉమ్మడి జిల్లాకు 80 కేటాయింపు



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతుల పంట పొలాలపై డ్రోన్లు జుమ్ జుమ్ అంటూ ఎగరనున్నాయి. ఇప్పటిదాకా రైతులు ఎరువులు, మందులు చల్లే పనులు కూలీలతో చేయించేవారు. ఇకపై ఈ పని డ్రోన్లు చేయనున్నాయి. ఇందు కోసం ఉమ్మడి జిల్లాకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు 80డ్రోన్లను మంజూరు చేశారు. వీటిని సప్లయ్ చేసేందుకు విహంగ, డ్రోగో కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలుగా నిర్ణయించారు. ఈ డ్రోన్ల మంజూరుకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీని అందిస్తుంది. మిగిలిన మొత్తాన్ని రైతులు కొంత పెట్టుకుంటే, బ్యాంకులు మరికొంత మొత్తాన్ని రుణంగా అందిస్తాయి. గ్రామాల్లో రైతు సంఘాలకు వీటిని అందజేస్తారు. ఒక్కో సంఘంలో ఐదుగురు సభ్యులు ఉంటారని, ఇప్పటికే సంఘాలు ఎంపిక చేసిన వారికి డ్రోన్ల వాడకం గురించి పైలట్ శిక్షణ ఇచ్చామని, ఖరీఫ్ పంట కాలానికి ఇవి రైతులకు అందుబాటులోకి వస్తాయని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ బదిలీ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవిని బదిలీ చేస్తూ గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె అమరావతిలోని రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. అయితే ఈమె స్థానంలో కర్నూలు జిల్లాకు ఎవరిని ఇంకా నియమించలేదు.

టైప్ రైటింగ్ పరీక్షల్లో స్టేట్ 3వ ర్యాక్



జోయల్ సందీప్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సాయి టైప్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థి జోయల్ సందీప్ టైప్ రైటింగ్ పరీక్షలో రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు గతేడాది సెప్టెంబర్‌లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించిందన్నారు. రెండు రోజుల క్రితం ఫలితాలు విడుదల కాగా జూనియర్ గ్రేడ్ టైప్ రైటింగ్ విభాగంలో సందీప్ మూడో ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు.

కీబోర్డ్ ప్రదర్శనలో గిన్నీస్ రికార్డు



సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి ఐజక్ న్యూటన్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కిడ్డీస్ రూట్స్ గ్లోబల్ స్కూల్ ఐదో తరగతి విద్యార్థి ఐజక్ న్యూటన్ గిన్నీస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కించుకున్నాడు. ఈనెల 14న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హల్లెల్ సంగీత వ్యవస్థాపకుడు ఆగస్టీన్ చేతుల మీదుగా తమ కుమారుడు గిన్నిస్ వరల్డ్ సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు తల్లిదండ్రులు సుధాకర్, సురేఖ తెలిపారు. హల్లెల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో 1,046 మంది ఒకే సమయంలో కీబోర్డ్ వాయించడంలో రికార్డు నెలకొల్పారన్నారు. డైరెక్టర్లు కేశవ నారాయ ణరెడ్డి, చిన్నపరెడ్డి అభినందనలు తెలిపారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం

'కందుకూరి' పురస్కార గ్రహీతలను సత్కరించిన టీజీ వెంకటేశ్



కందుకూరి విశిష్ట పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కళలను బ్రతికించుకునే క్రమంలో కళాకారులకు టీజీవీ కళాక్షేత్రం తరఫున అన్నివిధాలుగా ప్రోత్సాహకాలు కల్పిస్తామని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ వెల్లడించారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు అందుకున్న కళాకారులను ఐదుగురు కళాకారులను టీజీ వెంకటేశ్ గురువారం ఘనంగా సత్కరించారు. మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఉగాది పురస్కారాలు, కందుకూరి విశిష్ట పురస్కారాలు టీజీవీ కళాక్షేత్రానికి లభించడం సంతోషదాయకమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాస్థాయిలో ప్రకటించిన ఐదు పురస్కారాలన్నీ టీజీవీ కళాక్షేత్రానికే రావడం విశేషమని కొనియాడారు. అవార్డులు సాధించడానికి కళాకారులకు టీజీవీ కళాక్షేత్రం ద్వారా తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. కందుకూరి విశిష్ట పురస్కార గ్రహీతలు రిటైర్డ్ హెచ్ఎం ప్యాలకుర్తి ఎర్రమ పాండురంగయ్య, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, ఎం.ఆర్.రాధిక, వనారస మంజులను టీజీ వెంకటేశ్ అభినందించి, శాలువాతో సత్కరించారు. అదేవిధంగా టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 20 నుంచి జరిగే నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వారోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల్లో వీరిని విశేషంగా సత్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, రంగస్థల నటులు పి.రాజారత్నం, కేవీ రమణ, తబలిస్ట్ మహేష్ పాల్గొన్నారు.

భూమి సారానికి సూక్ష్మ పోషకాలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 9 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతున్నాయి. అదే విధంగా ఉద్యానపంటలు లక్షన్నర హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం భూమిసారాన్ని పెంచేందుకు సూక్ష్మ పోషకాలను ఉచితంగా అందించింది. ఆ తర్వాత 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని పూర్తిగా ఎత్తివేసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించడానికి సిద్ధపడింది. ఇందులో భాగంగా ఉచితంగా సూక్ష్మ పోషకాలను అందిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు హామీ ఇచ్చారు. ఎన్ని మెట్రిక్ టన్నులు కావాల్సిందీ క్షేత్ర స్థాయి నుంచి సమాచారాన్ని సేకరించి ప్రతిపాదనలు పంపాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. పొలంలో సారాన్ని పెంచేందుకు జింక్-21 శాతం, 800 మెట్రిక్ టన్నులు జింక్-12 శాతం, పది టన్నులు బొరాక్స్ 10.5 శాతం 100 టన్నులు, బోరాక్స్ 20 శాతం 25 టన్నులు, జిప్సం 15వేల టన్నులు ఉమ్మడి జిల్లాలోని రైతులకు అందించేందుకు ఆయా జిల్లాల జేడీలు ప్రభుత్వానికి ఇటీవల ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల పొలాల్లో ఏయే ఎరువులు ఎంత శాతం తక్కువగా ఉన్నాయో తెలుసుకునేందుకు మట్టి పరీక్షల నమూనాలను సేకరించడం ప్రారంభించారు. భూసార పరీక్ష కేంద్రాల్లో విశ్లేషణ ప్రక్రియ పూర్తి చేసి ఫలితాల పత్రాలను ముద్రించారు. ఏ రైతు పొలంలో ఏ రకం పోషకం లోపం ఎంత ఉన్నదీ వెలుగులోకి వచ్చింది.. నివారణకు ఏయే పంటకు ఎంత మోతాదులో పోషకాలు వాడాలనే సమాచారాన్ని కార్డుల్లో ముద్రిస్తున్నారు. భూసార పరీక్షల ఫలితాలు రైతులకు అందించే ప్రక్రియ మొదలైంది.

ఉచితంగా అందించాలని ప్రభుత్వ నిర్ణయం

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భూసార పరీక్షలను పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ పోషకాలను 50,75,100 శాతం రాయితీపై అందజేశారు. ఈసారి కూడా ఇదే విధానం అనుసరించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. వచ్చే ఖరీఫ్‌లో సాగు చేయనున్న పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, వరి, ఆముదం, కంది తదితర పంటలు సాగు చేసే రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 3వేల మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషకాలను తెప్పించాలని ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. నత్రజని, ఫాస్పరం, పొటాష్ ప్రధాన ఎరువులు పైరుకు బాగా అందాలంటే జింకు సల్ఫేట్, పొటాస్, జిప్సం, మెగ్నీషియం, మాంగనీస్ రకాలు కీలకమని, వీటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.



క్రీడలతో మానసికోల్లాసం

- డీఐజీ కోయ ప్రవీణ్
- క్రికెట్ ఆడి ఉత్సాహపరిచిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



బ్యాటింగ్ చేసేందుకు వెళ్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. గురువారం ఏపీఎస్పీ రెండో బెటాలియన్ మైదానంలో ఏపీఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ పోలీసులకు, సివిల్, ఏఆర్ పోలీసులకు, పోలీసు జట్ల మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను డీఐజీతో పాటు ఎస్పీ విక్రాంత్ పాటిల్ కలిసి ప్రారంభించారు. ఈ పోటీలకు కర్నూలు జిల్లా సివిల్, ఏఆర్ పోలీసుల జట్లకు కెప్టెన్‌గా కర్నూలు రేంజ్ డీఐజీ వ్యవహరించారు. ఏపీఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ పోలీసుల జట్టుకు కెప్టెన్‌గా జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ వ్యవహ రించారు. క్రికెట్ మ్యాచ్‌లో జిల్లా ఎస్పీ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. ఇరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీసుల విధి నిర్వహణ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు క్రీడలు ఎంతో దోహద పడుతాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం విధుల్లో ఉండే సిబ్బందికి క్రీడలు నూతనోత్సాహన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అడిషినల్ కమాండెంట్ నాగేంద్రరావు, డీఎస్పీ బాబు ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ఎం బాషా, సుధాకర్ రెడ్డి, రవికిరణ్, వెంకటరమణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ పోలీసులు ఉన్నారు.





బ్యాటింగ్ చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

నేడు గోదా గోకుల క్షేత్రంలో రఘునాథాచార్య శత జయంతి వేడుకలు

2 వేల మందితో సామూహిక విష్ణు పారాయణం



మాట్లాడుతున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులోని మామిదాలపాడులో కొలువైన గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో శుక్రవారం రఘునాథాచార్య శత జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జీయర్ స్వామీజీలతో ఉభయ వేదాంత పండిత సభ, సుమారు 2 వేలకు పైగా భక్తులతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం గోకుల క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివిధా ప్రాంతాలకు చెందిన జీయర్ స్వామీజీలతో కలిసి ఆయన కార్యక్రమ విశేషాలను వెల్లడించారు. నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు ఈ శతాబ్దానికే గొప్ప శాస్త్ర పండితులని, ఆయన వేదాలను సులువైన తెలుగులో అందరికీ అర్థమయ్యేలా వ్యాఖ్యానాలు రాశారని అన్నారు. రామాయణ మహాకావ్యంలోని 24వేల శ్లోకాలను కంఠతాపట్టిన వ్యక్తి అని కొనియాడారు. అలాగే త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ సహా ఎందరో జీయర్ స్వామీజీలకు ఆయన గురువుగా బోధన చేశారని, అలాంటి తమ గురువు, మహా మహోపాధ్యాయుని జయంతిని కర్నూలులో నిర్వహించుకోవడం పూర్వజన్మ సుకృతమని చెప్పారు. గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త మాట్లాడుతూ సంపత్కుమార జీయర్ స్వామి నేతృత్వంలో ఈనెల 13 నుంచి గోకులం శ్రీరామాయణ మహాయజ్ఞం కొనసాగుతోందన్నారు.

కర్నూలు చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

- ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం
- నేడు ఓర్వకల్లు, అహోబిలంలో పర్యటన



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఎంపీలు నాగరాజు, శబరి, ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు/ఆళ్లగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం కర్నూలుకు చేరుకున్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మంత్రి ప్రహ్లాదజోషికి ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆర్డీఓ సందీప్ కుమార్, గ్రీన్‌కో ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కర్నూలులోని మౌర్యఇన్ హోటల్‌కు చేరుకున్న మంత్రి రాత్రి అక్కడే బస చేశారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఓర్వకల్లు మండలం గుమితంతండా, పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య గ్రీన్‌కో గ్రూప్ 2800 ఎకరాల్లో, 5,230 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఇంధన పునరుత్పాదక ప్రాజెక్టు ఇది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.10వేల కోట్లకు పైగా గ్రీన్‌కో సంస్థ ఖర్చు చేసింది. రెండో విడత రూ.14వేల కోట్లను ఖర్చు పెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి శుక్రవారం ఈ ప్రాజెక్టును సందర్శిస్తారు. అనంతరం అహోబిలం చేరుకుని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. ఈ మేరకు రెండు జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి జడ్పీ పాఠశాలలో హెలీప్యాడ్, తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పశువులకు 'సూపర్' వైద్యం



కర్నూలులోని పశువుల ఆసుపత్రి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో 2017 సంవత్సరంలో జనవరి 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5.40 కోట్లతో నాలుగు అంతస్థుల భవనాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు రైతులు తమ జీవాలకు అధునాతన చికిత్స ఇక్కడ చేయిస్తున్నారు. కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు సమీపంలో మూగజీవాలకు అత్యున్నతమైన చికిత్సను అందించేందు కోసం టీడీపీ ప్రభుత్వం నాలుగు అంతస్థుల భవనాన్ని అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసింది. ఈ ఆసుపత్రిలో ప్రతిరోజు 100 నుంచి 150 దాకా పశువులు, గొర్రెలు, మేకలు, పెంపుడు జంతువులకు డాక్టర్లు చికిత్సను అందిస్తున్నారు. ఈ ఆసుపత్రిలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఎక్స్‌రే ప్లాంటును ఏర్పాటు చేయడం ఈ ప్రాంత రైతుల అదృష్టమనే చెప్పాలి. పశువులకు, ఇతర జీవాలకు ఇక్కడ అధునాతన వైద్యం అందిస్తున్నారు. మందుల కొరత లేకుండా, రూపాయి ఖర్చు లేకుండా డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. రోజూ పెంపుడు జంతువులు, కోడెద్దులు, గొర్రెలు, మేకలు, తదితర జీవాలతో ఈ హాస్పిటల్ ఎంతో కళకళలాడుతుండటం విశేషం. ప్రతి రోజు పెంపుడు కుక్కలకు ర్యాబిస్ నివారణకు ఖరీదైన వ్యాక్సిన్లు వినియోగిస్తున్నారు. ఈ హాస్పిటల్‌లో ఒక డిప్యూటీ డైరెక్టర్ స్థాయి కలిగిన వైద్యుడితో పాటు మరో ఇద్దరు అడిషనల్ డైరెక్టర్లు ఐదుగురు డాక్టర్లు ఇతర సిబ్బంది మరో 50 మంది ఉన్నారు. కోళ్లకు వారానికి ఒకసారి ఉచితంగా టీకాలను అందిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 3.62 లక్షల ఆవులు, 14.08 లక్షల మేకలు, గొర్రెలు, 5.85 లక్షల కోళ్లు, మరో 20వేల దాకా ఇతర పశుసంపద ఉన్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. నంద్యాల జిల్లాలో 4.14 లక్షల ఆవులు, 11.89 లక్షల మేకలు, గొర్రెలు, 7.05 లక్షల కోళ్లు, ఉన్నాయి. వీటికి ఈ హాస్పిటల్‌లో వైద్యాన్ని అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.



ఈ ఫొటోలో కోడెద్దుకు కాళ్లువాచాయి. తెలంగాణ రాష్ట్రంలోని అలంపూరు నియోజకవర్గం కంచుపాడు గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి అనే రైతుకు సంబంధించిన ఎద్దు ఇది. ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన కర్నూలు నగరంలోని వెటర్నరీ పాలీ హాస్పిటల్‌కు రైతు తన ఎద్దును తీసుకువచ్చాడు. గతంలో రాతిదూలం లాగుడు పందేల్లో అనేక విజయాలు సాధించిన ఎద్దు అనారోగ్యానికి గురైందని, వైద్యం కోసం ఇక్కడికి తీసుకొచ్చానని అన్నాడు. ఈ రైతు ఒక్కడే కాదు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వేలాది మంది రైతులకు నగరంలోని పాలీ క్లీనిక్ హాస్పిటల్ ఆధారమైంది.

సూపర్ స్పెషాలిటీ సేవలు

రాష్ట్రంలోనే ఉత్తమ వెటర్నరీ పాలి క్లీనిక్ హాస్పిటల్‌గా కర్నూలు నగరంలోని మూగ జీవాల కోసం ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడ ప్రతిరోజు 100 నుంచి 150 మూగజీవాలకు వైద్యాన్ని అందిస్తూ రైతుల నుంచి ప్రశంసలు అందుకోవడంతో డాక్టర్లు, సిబ్బంది సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

- 5.40 కోట్లతో నాలుగంతుస్తుల భవనం
- 2017 జనవరి 2న టీడీపీ హయాంలో ప్రారంభం
- నేటి వరకు వేల సంఖ్యలో వైద్యచికిత్సలు

రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి



కర్నూలు నగరంలోని ఈ హాస్పెటల్‌లో 24 గంటలు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. మూగజీవాలకు ఎలాంటి అనారోగ్యం సంభవించినా ఇక్కడికి వస్తున్నారు. పక్క రాష్ట్రాల నుంచి కూడా పశువులను ఇక్కడకు చికిత్స కోసం తీసుకువస్తు న్నారు. ఈ ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా పశువులకు సేవలందిం చేందుకు కొన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. డ్రైనేజీ తదితర ప్రత్యేక నిర్మాణాలు చేపట్టాల్సి వుంది. **- డా. హేమంత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్**



పదేళ్ల నుంచి ఇక్కడే చికిత్స

దాదాపు 10 సంవత్సరాలుగా ఈ హాస్పిటల్‌లోనే మా పెంపుడు జంతువు కుక్కకు వైద్యచికిత్సను తీసుకుంటున్నాం. దాదాపు 5 కి.మీల దూరంలో ఉన్న శిల్పటౌన్‌షిప్ కాలనీ నుంచి ఇక్కడకు వైద్యచికిత్స కోసం వస్తున్నాం. డాక్టర్లు ఎంతో శ్రద్ధ తీసుకుం టున్నారు. **- కులదీప్, శిల్ప టౌన్‌షిప్, కర్నూలు.**

పుణ్యస్నానానికి వెళ్లి అనంత లోకాలకు..

- తుంగభద్ర నదిలో స్నేహితుల మృతి

మంత్రాలయం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చి ఇద్దరు యువకులు తుంగభద్ర నదిలో మునిగి మృతి చెందిన ఘటన ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన బిచ్చాలలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలివి.. బెంగళూరులోని దేవనహల్లి గ్రామానికి చెందిన ముత్తురాజు (24), మదన్ (20) అనే యువకులతో పాటు 13 మంది మంత్రాలయానికి ఓ వాహనంలో వచ్చారు. ఉదయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని కర్ణాటకలోని బిచ్చాల బృందావనాన్ని అప్పన్నాచారి స్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. వాహనాన్ని తుంగభద్ర నది ఒడ్డున నిలిపివేసి స్నేహితులతో కలిసి నదిలోకి దిగారు. ముత్తురాజు నదిలోకి దిగుతుండగానే కాలుజారీ నీటి మడుగులో పడిపోయాడు. స్నేహితున్ని రక్షించబోయి మదన్ కూడా నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కర్ణాటకలోని ఏరిగేరి ఎస్ఐ అరుణ్ కుమార్ రాథోడ్ ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గంటల తర్వాత ముత్తురాజు మృతదేహం లభ్యం కాగా, మరో గంట పాటు పుట్టీలతో, గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టడంతో మదన్ మృతదేహం లభ్యమైంది. తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ముత్తురాజు ఓ హోటల్‌లో పని చేసేవాడు. మదన్ డిగ్రీ వరకు చదివి ఉద్యోగం ప్రయత్నం చేస్తుండేవాడు. ఎరిగేరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్ కుమార్ రాథోడ్ మృతదేహాలను రాయచూరు ఆసుపత్రికి తరించి అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరు పెట్రోలు బంకు వద్ద గురువారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. వివరాలివీ.. వెల్దుర్తి మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన వడ్డె వెంకటరమణ కుటుంబంతో కలిసి గుంటూరుకు వలస వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి వచ్చారు. భార్య పుట్టినిల్లు గోనెగండ్ల మండలం పెద్దనేలటూరుకు గ్రామానికి కుటుంబమంతా వెళ్లారు. గురువారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో భార్య, కూతురును ఆటోలో ఎక్కించి, కుమారులు అరవింద్, వేణుకుమార్‌తో కలిసి వెంకటరమణ బైక్‌పై బయలుదేరారు. అయితే వర్కూరు వద్ద పెట్రోలు కోసం బైక్‌ను బంకువైపు మళ్లిస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ బైక్ ఢీకొట్టింది. దీంతో తండ్రి, కొడుకులిద్దరూ కిందపడి గాయాలపాలయ్యారు. అలాగే వెనుక బైక్‌పై ఉన్న కౌతాళం మండలంలోని బదినేహాల్‌కు చెందిన షేక్షావలి, దాదాపీర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే తీవ్రగాయాలపాలైన వడ్డె వెంకటరమణ (45) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో కోలుకోలేక మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్..

ప్యాపిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్రప్రసాద్(23) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బనగానపల్లి నుంచి గుత్తికి వరిగడ్డి లోడుతో ట్రాక్టర్ బయలు దేరింది. మార్గమధ్యలోని పోతుదొడ్డి సమీపంలోకి రాగానే వెనుకవైపు నుంచి అతివేగంతో వస్తున్న లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నాగేంద్రప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నాగేంద్ర బనగానపల్లి మండలంలోని సాధుకొట్టం గ్రామానికి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



వెంకటేష్ (ఫైల్)

గోనెగండ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామానికి చెందిన బోయ కండ్ల వెంకటేష్(70) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలివి.. వెంకటేష్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగించేవారు. అయితే ఆరేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడు తున్నారు. దీంతో మద్యానికి బానిసయ్యారు. వ్యాధులు నయం కాకపోడంతో ఈనెల 15న రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో పురుగుల మందు తాగాడు. రాత్రి వాంతులు చేసుకుంటుండగా కుటుంబసభ్యులు 16వ తేది తెల్లవారుజామున ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25న గురుకుల పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి గురుకుల రెసిడెన్సియల్ ప్రవేశ పరీక్షను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఏపీఆర్‌సెట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. గురుకుల విద్యాసంస్థ అభ్యర్థుల హాల్ టికెట్‌ను https://aprs.apcfss.in/ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

పేద విద్యార్థుల నుంచి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో 25 శాతం కోటా సీట్ల ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి గాను ఉచిత విద్యను అందించే అన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు తమ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్ సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐబీ, సీబీఎస్‌ఈ, సిలబస్ పాఠశాలలో ప్రవేశాల కోసం ఏడాది 1.4.2025 నాటికి 5 సంవత్సరాల వయసు (సెంట్రల్ సిలబస్), రాష్ట్ర సిలబస్ కోసం ప్రవేశాలకు జూన్ 1వ తేదీ నాటికి 5 సంవత్సరాలు నిండిన పిల్లలు దరఖాస్తు చేసుకునటకు అర్హులు అన్నారు.

ప్రస్తుతం చిరునామా ధృవీకరణ కోసం తల్లిదండ్రులు ఆధార్, రేషన్ కార్డు, ఓటరు కార్డు, భూమి హక్కుల పత్రం, జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సుతో పాటు జనన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు సమర్పించాలన్నారు. సచివాలయాల డేటా ఆధారంగా మే 15 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థులు ప్రవేశానికి అర్హతలు స్టేట్ ప్రాజెక్టు ఎస్‌పీడీ నిర్ణయిస్తారన్నారు. లాటరీ ద్వారా మొదటి విడత పలితాలను మే 21 నుంచి 24 తేదీల మధ్య విడుదల చేస్తారన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ప్రవేశాల నిర్ధారణ జూన్ 2న చేస్తారు. రెండో విడత ఫలితాలను జూన్ 6న విడుదల చేస్తారన్నారు. పూర్తి సమచారం కోసం 18004258599 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు రూ.40.73 కోట్ల రుణాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.40.73 కోట్లు సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు ఈడీ కే.తులసీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి, రవాణా, వ్యవసాయం, తదితర రంగాల ద్వారా ఉపాధి పొందేందుకు 973 మందికి లబ్ధి చేకూర్చే విధంగా రూపొందించిన వార్షిక ప్రణాళికతో జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారన్నారు. అర్హులైన వారు మే 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రూ.3 లక్షల వరకు రుణాలను 176 మందికి, రూ.3 లక్షలకు పైబడిన రుణాలు 493 మందికి అందిస్తామన్నారు. రూ.10 లక్షలకు పైగా విలువ చేసే ఒక యూనిట్ (ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్) మాత్రమే ఉందని, ఇందుకు సబ్సిడీ 40 శాతం, బ్యాంకు లోనూ 55 శాతం పోనూ, లబ్దిదారుని వాటా 5 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రవాణా హెక్టారులో జిల్లాకు 294 యూనిట్లను కేటాయించడం జరిగిందని, ఇందులో 3 లక్షల నుంచి 10 లక్షల వరకు విలువ చేసే వాహనాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. అయితే ఐదుగురు సభ్యులుగా ఉన్న గ్రూపులకు రుణాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ యూనిట్లు మొత్తం 9 ఉన్నట్లు ఈడీ కే.తులసీదేవి వివరించారు.

పచ్చచొక్కా వేసుకోండి..!

- టీడీపీకి కొమ్ముకాస్తున్న పోలీసులు
- ఫోర్త్ టౌన్ సీఐపై మాజీ ఎమ్మెల్యే కాటసాని ఫైర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'పోలీసులు దిగజారుడు ఉద్యోగాలు చేస్తూ టీడీపీకి కొమ్ముకాస్తున్నారని, కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ పచ్చ చొక్కా వేసుకుంటే మంచిది..' అని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం కర్నూలు నగరంలోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కాటసాని పోలీసులపై విరుచుకుపడ్డారు. సీఐ మధుసూదన్ గౌడ్ పేరు చెప్పకుండానే నాలుగో పట్టణ పోలీసులు టీడీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారంటూ విమర్శించారు. సీఐ పచ్చచొక్కా వేసుకుంటే బెటర్ అంటూ ఎద్దేవ చేశారు. పోలీసులు టీడీపీ నాయకులతో ఒకలా, వైసీపీ నాయకులతో మరోలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఎప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండదని అదిగుర్తు పెట్టుకుని పోలీసులు ఉద్యోగాలు చేయాలని హితవు పలికారు. వైసీపీ క్యాడర్‌పై టీడీపీ నాయకులు దౌర్జన్యాలు చేసిన సందర్భాల్లో పోలీసులు కనీసం కేసుకూడా తీసుకోవడం లేదని ఆరోపించారు. టీడీపీ ఎంపీ శబరి తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. జగన్నాథగట్టుపై కబ్జా చేశానని ఆరోపించారని, చేతనైతే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. వైన్‌షాపులను బార్లుగా మార్చి విక్రయాలు చేస్తున్నా, గ్రామాల్లో బెల్టుషాపులు మీకు కనపడలేదా? అని ప్రశ్నించారు. చేతనైతే ఎక్సైజ్ అధికారులను తీసుకెళ్లి బెల్టుషాపులపై దాడులు చేయించాలని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పాణ్యం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరుకల్లు తండాలో బయటపడ్డ రేషన్ బియ్యాన్ని గురువారం నంద్యాల సివిల్ సప్లయీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయీస్ డీటీ ప్రసాద్ ఆధ్వర్యంలో 206 పాకెట్లతో పాటు మరో 16 పాకెట్లను స్వాధీనం చేసుకుని నంద్యాల సీఎస్ గోడౌన్‌కు తరలించారు. తమ్మ రాజుపల్లె సమీపంలోని ఎస్‌టర్నింగ్ వద్ద ఉన్న గోడౌన్‌లో బియ్యం రాశులుగా ఉండడంతో తూకం వేయడానికి కొంత సమయం పడు తుందని, శుక్రవారం పూర్తి వివరాలు తెలుస్తాయని డీటీ తెలిపారు. తమ్మరాజుపల్లెలో దాదాపు వెయ్యి పాకెట్ల బియ్యం ఉంటాయని అభిప్రాయపడ్డారు. గోడౌన్‌లో నిల్వ ఉంచిన అక్రమార్కులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, ఆర్ఐ రాము, వీఆర్వో బీరేంద్ర, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇద్దరి అరెస్టు

నంద్యాల క్రైం/టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌లో ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు, ఏఎస్పీ మందా జావళి సూచనలతో గురువారం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మద్దిలేరు వాగు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నంద్యాల పట్టణం హరిజనపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు నాటుసారాతోపాటు కత్తులు కలిగి ఉండటంతో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. హరిజనవాడకు చెందిన కొమ్ముపాలెం బద్రి అలియాస్ బ్రహ్మయ్య నందమూరినగర్‌కు చెందిన ఇమ్మానియేల్ అలియాస్ పొట్టి ఒక్కొక్కరివద్ద 10లీటర్ల సారాతో పాటు పెద్ద కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కొన్ని పాతకేసులు కూడా ఉన్నాయన్నారు. వన్‌టౌన్ సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపైన, నేరచరిత్రగలవారిపైన వారి కదలికలపైన నిఘావేసి ఉంచామన్నారు.

యూనియన్ బ్యాంక్‌కు వడ్డింపు

- బీమా పరిహారం, ఖర్చులు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశం



కర్నూలు లీగల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల నుంచి బీమా ప్రీమియం వసూళ్లు చేసి ఆ తర్వాత ఆయన మృతి చెందిన తర్వాత బీమా మొత్తం చెల్లించకుండా సేవాలోపం చేసిన కోవెలకుంట్లలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. కోవెలకుంట్లకు చెందిన పువ్వాడి రామసుబ్బయ్య కోవెలకుంట్లలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఒక ఖాతాను తెరిచారు. బ్యాంకు అధికారులు ప్రతి ఏడాది ఖాతాదారుడి నుంచి అభయ గోల్డ్ బీమా పథకానికి ప్రీమియం వసూలు చేసేవారు. ఆ తర్వాత రామసుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుమారుడు నామీని అయిన పువ్వాడి సురేష్ అబయగోల్డ్ బీమా మొత్తం రూ.1.50 లక్షల కోసం బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. మృతుడి వయస్సు 70ఏళ్లు కావడంతో పాలసీ అతనికి వర్తించదని బ్యాంకు అధికారులు ఫిర్యాది దరఖాస్తును తిరస్కరించారు. దీంతో ఆయన బ్యాంకుతో పాటు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో పాలసీ నిబంధనల మేరకు ఖాతాదారుడు 75 సంవత్సరాల వరకు ఈ బీమా వర్తిస్తుందనే నిబంధనలను వినియోగదారుల కమిషన్ గుర్తించింది. దీంతో ఫిర్యాది చేసుకున్న క్లెయిమ్‌ను బ్యాంకు అధికారులు తిరస్కరించడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. ఈ మేరకు బ్యాంకు అధికారులు ఫిర్యాదికి బీమా రూ.1.50 లక్షలను 9 శాతం వడ్డీతో పాటు మానసిక ఆవేద నకు గురి చేసినందుకు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.15 వేలు చెల్లించాలని ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, మహిళా సభ్యురాలు నజీమా కౌసర్లు గురువారం ఆదేశాలు జారీ చేశారు.

విమానాశ్రయంలో కేంద్ర మంత్రికి ఘన స్వాగతం


కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఓర్వకల్లు/ కర్నూలు క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఓర్వకల్లు మండలంలోని పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టును సందర్శించేందుకు గురువారం విచ్చేశారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో ఆయనకు కర్నూలు, నంద్యాల పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. కర్నూలు నగరంలోని మౌర్యఇన్ హోటల్ చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మర్యాద పూర్వకంగా కలిసి జాయింట్ కలెక్టర్ బి.నవ్య పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఐ సునీల్ కుమార్ ఉన్నారు.

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' నిర్వహించండి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం వాట్సాప్ గవర్నెన్స్ అంశాలపై జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులు, మండల అధికారులతో జాయింట్ కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నవ్య మాట్లాడుతూ ఈ నెల 3వ వారంలో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల థీమ్ ఈవేస్ట్ కలెక్షన్‌గా ప్రభుత్వం నిర్వహించనుందన్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలతో పాటు గూడూరు నగర పంచాయతీలో కూడా రెడ్యూస్ రీసైకిల్ మరియు రీయూస్ (ఆర్ఆర్ఆర్) సెంటర్లను కలెక్షన్ పాయింట్లుగా పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా పంచాయతీలో కూడా ఒక సెంటర్‌ను ఎల్రక్టానిక్ వేస్ట్ కలెక్షన్ పాయింట్‌గా ఏర్పాటు చేసుకోవాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

కార్యాలయానికి క్యూకట్టిన ఉద్యోగులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలోని కాంట్రాక్టు ఉద్యోగులు ఐదు రోజుల్లో రివైజ్డ్ అటెస్టేషన్ ఫామ్స్ (ఐదు సెట్లు) ఇవ్వాలని అధికారులు ఆదేశించడంతో ఉద్యోగులు గురువరం కార్యాలయానికి క్యూ కట్టారు. ఈ ఫామ్స్‌పై గెజిటెడ్ ఉద్యోగితో సంతకాలు పెట్టించాలని ఆదేశించడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క శనివారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆసుపత్రికి రానున్న దృష్ట్యా అధికారులు బిజీగా ఉన్నారు. మరో పక్క ఫామ్స్ ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండటంతో కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మంత్రి పర్యటన తర్వాత ఈ ప్రక్రియను చేపట్టాలని వారు కోరుతున్నారు. దీనిపై ఏడీ అనిల్ కుమార్ రెడ్డిని వివరణ అడుగ్గా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి కాంట్రాక్టు ఉద్యోగి కొవిడ్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లను అడుగుతున్నామని, కానీ ఐదు రోజుల గడువు విధించలేదని తెలిపారు.

నేడు ఆచార్య తుమ్మల రామకృష్ణ సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కథా సమయం సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన ద్రవిడ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ సంస్మరణ సభ నిర్వహి స్తున్నట్లు కథా సమయం కార్యవర్గ సభ్యుడు జి. ఉమామహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రం సాహిత్య వేదికపై ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 1990 దశకంలో ఆచార్య తుమ్మల రామకృష్ణ కర్నూలు నగరంలో అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న పీజీ సెంటర్‌లో తెలుగు అధ్యాపకులుగా పని చేశారని తెలిపారు. ఇక్కడే తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తూ ఆయన కథా రచన ప్రారంభించారని, ఈ సంస్మరణ సభకు సాహిత్యాభిమానులంతా హాజరు కావాలన్నారు.

విష్ణుకు సముచిత స్థానం కల్పించాలి

కర్నూలు రూరల్ ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పించాలని ఆయన వర్గీయులు పార్టీ పరిశీలకుడిని కోరారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి గురువారం విష్ణు ఇంటికి వచ్చారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డికి ఏదైనా నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరారు. ఈవిషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి విష్ణుకు ఏదో ఒక నామినేటెడ్ పదవి ఇప్పించేందుకు కృషి చేస్తానని రామలింగారెడ్డి హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై హర్షం

కర్నూలు రూరల్ ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి హర్షం వ్యక్తం చేశారు. ముప్పై ఏళ్ల మాదిగల పోరాట ఫలితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏబీసీ అనే మూడు క్యాటగిరిగా విభజించింది. త్వరలోనే రాష్ట్ర గవర్నర్ కూడా గజిట్ పత్రాన్ని విడుదల చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలకు రిజర్వేషన్ల ప్రాతిపదికన ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఈనేపథ్యంలో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

'రాష్ట్ర చైర్మన్ పదవి ఎల్లప్పకు ఇవ్వాలి'

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నో సేవా కార్యక్ర మాలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్పకు అధిష్టానం తగిన గుర్తింపు ఇవ్వాలని జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని జిల్లా వికలాంగుల సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 30 ఏళ్లుగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఎల్లప్పకు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరారు. సమావేశంలో నాయకులు మద్దిలేటి, మక్బూల్ బాషా, సురేష్, మహేష్, వెంకటేశ్, మద్దమ్మ పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం


కమిషనర్‌ను సన్మానిస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ భవన్‌కు పెయింటింగ్ వేయించినందుకు కార్పొరేషన్ కమిషనర్‌ను టీడీపీ కార్పొరేటర్లు సన్మానించారు. గురువారం కమిషనర్ కార్యాలయంలో టీడీపీ మాజీ కార్పొరేటర్ కె.ఏసన్న ఆధ్వర్యంలో కార్పొరేటర్లు పద్మలతారెడ్డి, కురువ పరమేష్, పి.శివ, మాజీ కార్పొరేటర్లు రామాంజనేయులు, గున్నామార్కులు కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్, బాబు జగ్జీవన్ రామ్ సర్కిల్‌లో నూతన రెయిలింగ్ అభివృద్ధి పనులు చేయించడం అభినందనీయమన్నారు.

అశ్వవాహనంపై విహరించిన సీతారాములు


అశ్వవాహనంపై శ్రీరామచంద్రమూర్తి, కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని శ్రీపేట రామాలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఆరో రోజున తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం సీతారాములు అశ్వ వాహనంపై విహరించారు. చైత్ర శుద్ధ పంచమిని పురస్కరించుకొని ఏకాంత రాముని మూల విరాట్టుకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వత్తి పత్తితో ప్రత్యేక అలంకరణ చేశారు. కడప ఉత్తరాదిమఠం మఠాధికారి సుధా పండితుడు విద్యానిధి ఆచార్యులు బ్రహ్మోత్సవ హోమం, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా నైవేద్య సమర్పణ అనంతరం అన్నప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సహితంగా అశ్వ వాహనంపై స్వామివారి పారువేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి హనుమేషాచార్య, ఆలయ ఈవో దినేష్‌కు మార్ చౌదరి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుకూరు ప్రభాకర్ ఆధ్వర్యంలో పాతనగరంలోని వీధుల్లో స్వామివార్లను ఊరేగించారు. శరీన్‌నగర్ ఠాగోర్ విద్యానికేతన్ విద్యార్థినులతో బృంద నృత్యం, సూర్యకళా కల్చరల్ అకాడమీ బాలలచే కూచిపూడి నృత్యాలు అలరించాయి. మైసూర్‌కు చెందిన మధులిక సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాళిగి పావని, కట్టా రాఘవేంద్ర, సత్యనారాయణమూర్తి, సుధాకర్, సుజాత, మంజరి, మాళిగి భానుప్రకాశ్ పాల్గొన్నారు.

పాత వైద్యవిధానాన్ని అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

కర్నూలు రూరల్ ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో ఈహెచ్ఎస్ బదులుగా పాత వైద్యవిధానాన్ని అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ రీజనల్ ప్రెసిడెంట్ ఎస్ఆర్ నాయుడు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పీఏ వలిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌యంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కర్నూలు-1డిపో ఎదుట కార్మికులు ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి కర్నూలు-1డిపో కార్యదర్శి సయ్యద్ ఇసాక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఆర్ నాయుడు, పీఏ వలి హాజరై మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రీజనల్ నాయకుడు రంగన్న, కర్నూలు-2డిపో కార్యదర్శి ఎంఎస్‌టీరెడ్డి, గ్యారేజీ కార్యదర్శులు రవీంద్రబాబు, తిమ్మన్న, ఉమాదేవి, కార్మికులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలి: సీపీఎం


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పేదలు మండలంలోని గ్రామాల్లో కాల్వ, కొమరోలు, లొద్దిపల్లె, కేతవరం గ్రామాల్లో ప్రభుత్వ భూములను సాగు చేసుకుని జీవిస్తున్నారన్నారు. అయితే ఆ భూము లకు పాసుపుస్తకాలు మంజూరు చేయడంలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, బషీర్, లక్ష్మీదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణకు సంబంధించి ముస్లింలకు న్యాయం జరిగే పోరాడతామని మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో నాన్ ముస్లింలను ఎలా చేరుస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించిందన్నారు.

● వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలని సేవ్ వక్ఫ్ జేఏసీ నాయకుడు డి.అబ్దుల్‌దేశాయ్ డిమాండ్ చేశారు. నగరంలోని పాత బస్తీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ డైరెక్షన్లో చట్టాలను తీసుకువస్తుందని అన్నారు. ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ నాయకులు హమీద్, జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు పీఎస్. మునీర్ అహ్మద్, సీపీఎం నగర నాయకుడు ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నగరాలు, పట్టణాల ప్రజల సౌకర్యార్థం స్థానిక సమస్యలకు సులువుగా పరిష్కారం పొందేందుకు వీలుగా పురమిత్ర యాప్‌ను రూపొందించిందన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, ఇళ్లలో చెత్త సేకరణ, ఇంటి పన్ను చెల్లింపు, భవన నిర్మాణ అనుమతులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుళాయిల ఏర్పాటు వంటి 119 రకాల సేవలు పురసేవ యాప్‌లో అందుతాయన్నారు. దీనిని ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వాడలలో కార్మికులను ఉత్తేజ పరిచేందుకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, సభలు, సమావేశాలు జరిపించాలని అన్నారు. మే 1వ తేదీ నుంచి 7 వరకు నగరంలో న్యూసిటీ కమిటీ పరిధిలో 12 ప్రాంతాలలో కార్మిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నగర నాయకులు కె.ప్రభాకర్, సుధాకరప్ప, ఎండీ మహ్మద్, హుస్సేన్ మల్లికార్జున పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జనాభా లెక్కల ప్రకారం పంచాయతీలకు నిధులు కేటాయించాలని కొత్తపల్లి జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, డోన్ ఎంపీపీ రేగడి రాజశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం తిరుపతిలో 16వ ఆర్థిక సంఘం సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి జడ్పీటీసీ, ఎంపీపీ తరఫున పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదనలను సంఘం చైర్మన్ అరవింద్ పనాగరియకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ డైరెక్టర్ వీఆర్.కృష్ణతేజ మైలవరపు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు అందని వేతనం

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు ఉద్యోగులకు ఏప్రిల్ నెల వేతనం అందక విలవిల్లాడుతున్నారు. ప్రతి నెలా 1వ, 2వ తేదీల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనం వారి అకౌంటులో జమ అయ్యేది. ఈసారి 18వ తేదీ అవుతున్నా జీతం పడకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇంటి అద్దె పిల్లల స్కూళ్ల ఫీజుల, ఈఎంఐలు కట్టలేకపోతున్నారు. ఆసుపత్రిలో దాదాపు 600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉండగా. వీరిలో 450 మంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ఉన్నారు. ఆసుపత్రి అధికారులు స్పందించి ఏప్రిల్ వేతనం వచ్చేలా చూడాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏడీ అనిల్ కుమార్ రెడ్డిని వివరణ కోరగా.. కాంట్రాక్టు ఉద్యోగుల వేతనం తన దృష్టికి రాలేదన్నారు.

రీసర్వేకు సహకరించండి: తహసీల్దార్



గూడూరు: ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ రామాంజనేయులు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ కోరారు. గురువారం మండలంలోని గోరంట్ల గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమక్షంలో రీసర్వే జరుగుతుందని, పట్టాదారులు, కొనుగోలుదారులు మ్యూటేషన్ ప్రక్రియ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఏవైనా సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీల్ పాల్గొన్నారు.

గూడూరు: రీసర్వే కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. గురువారం గూడూరులో రీసర్వేపై రెవెన్యూ అధికార యంత్రాగం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ రెడ్డి, సర్వేయర్ బాబు నాయక్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, నగర పంచాయతీ మేనేజర్ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యసిబ్బంది

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని లద్దగిరి పీహెచ్‌సీ ఎదుట ఎంఎల్‌హెచ్‌పీలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీలు మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా తమకు 23 శాతం వేతన సవరణ ఇవ్వాలని, ఆరేళ్ల సర్వీసు ఉన్నవారిని రెగ్యులర్ చేయాలని, పెండింగ్ ఇన్‌సెంటివ్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ వెల్నెస్ సెంటర్ అద్దె బకాయిలు విడుదల చేయాలని, ఈపీఎఫ్‌వో అమలు చేయాలని కోరారు. వారికి ఏపీ ఎన్జీవో తాలూకా అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ సంఘీభావం తెలిపారు.

సీనియర్ సిటిజన్ ఐడీ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన వారు సీనియర్ సిటిజన్ ఐడీ కార్డుకు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా తెలిపారు. పురుషులు 60 సంవత్సరాలు, మహిళలు 58 సంవత్సరాలు పైబడిన వారు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో సీనియర్ సిటిజన్ ఐడీ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వయోవృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పారదర్శకంగా ఉద్యోగాల నియామకాలు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలో ఉద్యోగుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో పి.శాంతికళ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల నియామకాలకు సంబంధించి రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తూ ఎలాంటి అక్రమాలకు, అవకతవకలకు లేకుండా మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దన్నారు.

హజ్ కమిటీ సభ్యుడిగా నూరి మన్సూర్ అలీ ఖాన్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరి మన్సూర్ ఆలీ ఖాన్‌కు చోటు దక్కింది. సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయన్ను సామాజిక కార్యకర్తల విభాగం కింద హజ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ పదవీ కాలం మూడేళ్లు ఉంటుంది. హజ్ కమిటీ సభ్యుడిగా తనను నియమించిన సీఎం చంద్రబాబు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రక నిర్ణయం: టీడీపీ

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం చారిత్రక నిర్ణయమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ధరూర్ జేమ్స్ అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దళితుల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణకు ఘన నివాళి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సబ్ ట్రెజర్ ఆఫీసర్ రమణ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లికా ర్జున, విజయ శేఖర్, కృష్ణమోహన్, సోమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గూడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ పరిధిలో డెంగీ కేసు నమోదైంది. గురువారం జిల్లా మలేరియా అధికారి నూకరాజు, జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్, డాక్టర్ ప్రత్యూష, హెచ్ఈ కృష్ణా రెడ్డిలు గూడూరులో పర్యటించారు. గూడూరులో మూడేళ్ల చిన్నారికి డెంగీ పాజిటివ్ కేసు నమోదు కాగా, స్పందించిన వైద్యాధికారులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సను అందించారు. జిల్లా మలేరియా అధికారులు గూడూరులోని ఆ చిన్నారి ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. తల్లిదండ్రులకు, కాలనీవాసులకు డెంగీపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ముస్లింలకు డీఎస్సీ ఉచిత కోచింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బిర్లాగేటులోని శ్రీధర్ కోచింగ్ సెంటర్‌లో ముస్లిం విద్యార్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మైనార్టీ డిపార్టుమెంటు ద్వారా ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. డీఎస్సీకి అర్హత కలిగి ఉన్న ముస్లిం మైనార్టీ, బీసీ-సీ క్రిస్టియన్స్‌తోపాటు బుద్దిస్ట్, పార్సి, సిక్కుల అభ్యర్థులు బిర్లాగేటులోని నిహాల్ సెంటరులో గల శ్రీధర్స్ కోసింగ్ సెంటర్‌లో సంప్రదించా లన్నారు. వివరాల కోసం 7416449171ను సంప్రదించాలని సూచించారు.

26 నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా కదిరిలో ఈనెల 26, 27 తేదీల్లో 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు తెలిపారు. 13 ఉమ్మడి జిల్లాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మూడు జిల్లాలకు కొత్తగా పాల్గొనేందుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తమిళనాడులోని అరనిలో జరిగే సౌత్ ఇండియా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌కు, గుజరాత్ లోని బుజ్ అనే పట్టణంలో 54వ జాతీయ స్థాయి పురుషుల హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

చీరల బ్యాగ్ అప్పగింత


బాధితుడికి చీరల బ్యాగ్‌ను అప్పగిస్తున్న దృశ్యం

కర్నూలు క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆటోలో చీరల బ్యాగ్ పోగొట్టుకున్న బాధితుడికి కర్నూలు పోలీసులు ఆ బ్యాగ్‌ను తిరిగి అప్పగించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన చీరల వ్యాపారి జగదీష్ మౌర్యఇన్ సర్కిల్ వద్ద ఆటో ఎక్కి డ్రస్ సర్కిల్ వద్ద ఆటో దిగాడు. కొంచెం ముందు పోయిన తర్వాత ఆటోలో బ్యాగ్ మరిచిపోయినట్లుగా గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. టూటౌన్ పోలీసులు కమాండ్ కంట్రోల్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా సీసీ ఫుటేజీని పరిశీలించి ఆటోను గుర్తించారు. ఆటోలో ఉన్న రూ.12వేల విలువైన చీరల బ్యాగ్ ను తిరిగి అప్పగించడంతో బాధితుడు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజా ఫిర్యాదుకు స్పందించిన మంత్రి భరత్

● కదిలిన అధికార యంత్రాంగం
● ఆరు నెలల సమస్య వెంటనే పరిష్కారం


రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అడ్డుగా ఉన్న మట్టి కుప్పలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి వేగంగా స్పందించారు. ప్రజల నుంచి వచ్చిన వాట్సప్ మెసేజ్‌కు స్పందించిన మంత్రి అధికార యంత్రాంగానికి పంపి సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకున్నారు. నగర పాలకపరిధిలో మద్దూరు నగర్ నుంచి కృష్ణానగర్ వైపు వెళ్లే రైల్వే బ్రిడ్జి కింద ఆరు నెలలుగా కాలువ పనుల కోసం మట్టిని తవ్వి అడ్డుగా వేశారు. దీంతో అబ్బాస్‌నగర్, మద్దూర్‌నగర్, ఠాగూర్‌నగర్, కృష్ణానగర్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరికొందరైతే ఆ మట్టికుప్పలను దాటలేక కిందపడి గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య సమస్యను వివరిస్తూ మంత్రి టీజీ భరత్‌కు బుధవారం రాత్రి వాట్సప్ ద్వారా సమస్యను వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో వెంటనే గురువారం ఉదయం 7 గంటలకు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు వెంటనే సిబ్బంది, ప్రొక్లెయినర్లను పంపి రోడ్డుకు అడ్డుగా ఉన్న మట్టి కుప్పలను తొలగించారు. ఎంతో కాలంగా ఉన్న సమస్యను మంత్రి టీజీ భరత్ స్పందించి పరిష్కరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


మట్టి కుప్పలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మెనూ ప్రకారం వడ్డించాలి

తుగ్గలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్ సూచించారు. గురువారం తుగ్గలి, రాతన పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పౌష్టికాహారం, నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

పని చేసిన వారి పేర్లే ఉండాలి


జొన్నగిరిలో మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీవో

తుగ్గలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు వచ్చిన వారి పేర్లే మస్టరులో ఉండాలని ఏపీవో హేమసుందర్ సూచించారు. గురువారం జొన్నగిరి, ఎర్రగుడి గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీలు ఉదయాన్నే పని వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన కొలతల మేరకు పనులు చేస్తేనే రూ.300 వేతనం అందుతుందన్నారు. అవినీతికి పాల్పడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట టీఏ రాజశేఖర్, సీనియర్ మేట్లు ఆంజనేయులు, జయచంద్ర తదితరులు ఉన్నారు.

బీటీ నాయుడుకు చేనేతల సన్మానం


బీటీ నాయుడిని సన్మానిస్తున్న చేనేత నాయకులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన బీటీనాయుడును గురువారం చేనేత నాయకులు సన్మానించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి స్వకుళ సాలీయులు అండగా ఉన్నారని వారి అభివృద్ధికి సహకరించాలని స్వకుళ సాలీయుల సమాజ మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు సాకరే మారుతీ రావు కోరారు. చేనేతలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. బీటీ నాయుడు మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేజీ వీరన్న, సాకరే వీరన్న, సాకరే గోపాలకృష్ణ, గణేషి నాగరాజు, సపారే నాగరాజు, జిందే గోవింద రాజు, ఆర్కాట్ శివ, గోవిందరాజులు, శ్రీనివాసులు, జుజారే చిదానం మహేష్, సరోదే హరికృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వెట్టి చాకిరీ

- 20 నుంచి 30 ఏళ్లుగా అదే వేతనం
- నెలకు రూ.10,750లు మాత్రమే


ఆలూరులో కాలువను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విధులు నిర్వర్తించే కార్మికులకు 30 ఏళ్లుగా అదే వేతనం ఇస్తున్నారు. నిత్యం మురుగులోనే విధులు నిర్వహిస్తూ అనారోగ్యాల పాలవుతున్న తమను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.10,750కు మించి వేతనం ఇవ్వడం లేదని కుటుంబ పోషణ భారంగా మారుతుందని పంచాయతీ పారిశుద్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు సిబ్బంది అవసరమే

ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీలో మొత్తం 28 మంది పారిశుద్య కార్మికులు ఉండగా అందులో 4 గురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. మిగిలిన 24 మందిలో నలుగురు వాటర్ మెన్, 4గురు స్వీపర్లు, ఇద్దరు ఎలక్ట్రికల్, 10 మంది పారిశుద్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. జనాబా పెరగడంతో అదనపు సిబ్బంది అవసరమని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెంచడం లేదంటున్నారు. వాటర్ మెన్‌లకుఏ రూ.9,500లు, స్వీపర్లకు రూ.7వేలు పారిశుద్య కార్మికులకు 10,750లచొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. తమకు వేతనాలు పెంచాలని కోరుతున్నారు.



వేతనం పెంచాలి

20ఏళ్లుగా పారిశుద్య కార్మికుడిగా పని చేస్తున్నా. రూ.10750లు మాత్రమే ఇస్తున్నారు. వేతనం పెంచాలని పలుమార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలి. - రాముడు, పారిశుధ్య కార్మికుడు ఆలూరు

రెగ్యులర్ చేయాలి

ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మురుగులోనే పని చేయడంతో అనారోగ్యం పాలవుతున్నాం. అనారోగ్యంతో ఒక్కరోజు రాకపోయినా వేతనం కట్ చేస్తున్నారు. వేతనం చాలకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం రెగ్యులర్ చేయాలి. - లక్ష్మేంద్ర, కార్మికుడు, ఆలూరు



సమాచారం ఇవ్వకుండా తీర్మానమా?

- మండల సమావేశంలో సర్పంచ్‌ల ధ్వజం


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు

మద్దికెర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేయడం మంచిదే కానీ తమకు సమాచారం ఇవ్వకుండా తీర్మానం చేయ మంటే ఎలా? అని సర్పంచులు బురుజుల విజయుడు, కారుమంచి మల్లికార్జున ప్రశ్నించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అనిత యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ తమకు సమాచారం ఇవ్వకుండా రోడ్లు మంజూరు చేసుకుని వచ్చి సంతకం పెట్టమంటున్నాని ఎక్కడ పడితే అక్కడ పనులు పెడితే ఎలా అని ప్రశ్నించారు. స్పందించిన ఎంపీడీవో కొండయ్య, పీఆర్ ఏఈ విష్ణు మరోసారి ఇలా జరగకుండా చూస్తామని సమాధానమిచ్చారు. జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, తహసీల్దార్ హుశేన్‌షాహెబ్, ఎంపీడీవో కొండయ్య, ఎంఈవో రంగస్వామి, ఏపీవో నర్సిరెడ్డి, ఏవో రవి, సర్పంచులు ఆంజనేయులు, సుహాసిని పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడవద్దు

తుగ్గలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అవకతవకలకు పాల్పడవద్దని తహసీల్దార్ రమాదేవి సిబ్బందికి సూచించారు. గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ సర్టిఫికెట్ల మంజూరుకు వచ్చిన వారికి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలన్నారు.

టీడీపీతో అన్ని వర్గాలకు న్యాయం

- వర్గీకరణకు మద్దతుగా నిలిచిన చంద్రబాబు
- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు న్యాయం చేకూరుతుందని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు చందోలి తిరుపాల్‌తో కలసి గురువారం పత్తికొండలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. వర్గీకరణకు మొదటి నుంచి చంద్రబాబు మద్దతుగా నిలిచారని, నేడు వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ చేసి ఇచ్చిన మాటను నిలుపుకున్నా రన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రానున్నరోజుల్లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. తిరుపాల్ మాట్లాడుతూ ఎస్సీవర్గీకణపై ఆర్డినెన్స్ జారీ చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ బీసీ సెల్ నాయకులు రామానాయుడు, కన్వీనర్ కడవల సుధాకర్, శ్రీనివాసులు గౌడ్, ఎస్సీసెల్ నాయకులు బోనాల కాశీ, ఉచ్చీరప్ప, హోసూరు అంజి, దూదేకొండ సుధాకర్ ఉన్నారు.

వర్గీకరణకు ఆమోదంపై హర్షం

ఆలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మాదిగల 30 ఏళ్ల పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం పట్ల టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నంగి నరసప్ప, ప్రధాన కార్యదర్శి కొమ్ము రామాంజినేయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో బూత్ కన్వీనర్ మసాలా జగన్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారరు. వర్గీకరణతో డీఎస్సీలో మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు వర్గీకరణ పట్ల చిత్తశుద్ధితో ఉన్నారని, ప్రధాని మోదీ వర్గీకరణను న్యాయమైన కోరికగా గుర్తించాడన్నారు. బి.రాజు, మసాలా జగన్, ఉలిగప్ప, పెయింట్ గోవింద్, బాలరాజు, నల్లమల రామాంజీ, మూట వీరేష్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే దళితుల అభివృద్ధి

ఆదోని, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని టీడీపీ యువ నాయకుడు, ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరాం, మదిరె వీరేష్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలుప డంపై అమోఘమన్నారు. రామకృష్ణ, వలమన్న, ఈరప్ప, శివ, నాగరాజు ఉన్నారు.

సీపీఎం కోర్సులో ప్రథమ ర్యాంకు

- విద్యార్థికి బంగారు పతకం, ల్యాప్‌టాప్ అందజేసిన మంత్రి లోకేశ్


ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న మంత్రి లోకేశ్

ఆదోని రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన తిక్కయ్య, అగసనమ్మ దంపతుల కుమారుడు రాఘవేంద్ర ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఒకేషనల్‌లో సీపీఎం (క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్) కోర్సులో 958 మార్కులు సాధించాడు. సీపీఎం కోర్సులో రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంకు సాధించడంతో ఈనెల 15వ తేదిన విజయవాడలోని మంత్రి నారా లోకేశ్ క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా బంగారు పతకం, ల్యాప్‌టాప్ అందుకున్నారు.

ఫెయిల్ అయినా నిరుత్సాహపడొద్దు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పరీక్షలో ఫెయిల్ అయినా నిరుత్సాహ పడొద్దని జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పెద్ద సురేష్ సూచించారు. గురువారం ఆదోని కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులతో మాట్లాడారు. ఫెయిల్ అయితే కుంగి పోవద్దని విజయానికి అది మెట్టు అని గుర్తించాలన్నారు. పట్టుదల ఉంటే మరో ప్రయత్నంలో విజయం సాధిస్తారని సూచించారు. ఆత్మహత్యలకు పాల్పడవద్దని తల్లిదండ్రులకు మంచి బిడ్డలుగా ఉండాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్ శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కౌన్సిలర్‌గానే ప్రజా సేవ చేస్తా..'


వాల్మీకి శాంత

ఆదోని టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇకపై తాను కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజాసేవ చేస్తానని అపద్ధర్మ చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అన్నారు. అవిశ్వాస తీర్మానంలో ఓటమి పాలైన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తనకు సహకరించిన కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తన కు పదవిని ఇచ్చిన వైసీపీ అధినేత జగన్‌తో పాటు కార్యకర్తల కు కృతజ్ఞత తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ వైసీపీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ప్రసక్తి లేదని శాంత స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే లోక్‌నాథ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే లోక్‌నాథ్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే విరుపాక్షి, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీ నారాయణ అన్నారు. గురువారం మొలగవల్లి గ్రామంలో ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. నిస్వార్థ రాజకీయా లు చేస్తూ మచ్చలేని నాయకుడుగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన మృతి బాధాకరం అన్నారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రెడ్డి కుమారుడు హేమచంద్ర రెడ్డి, సర్పంచ్ మోహన్ రాజ్, టీడీపీ సీపీఐ, వైసీపీ నాయకులు రామ్‌నాథ్ యాదవ్, అశోక్, రంగస్వామి, మల్లయ్య, సుబ్బారెడ్డి, శీనప్ప, భూపేష్, ఆలూరు గుండన్న, చిన్న ఈరన్న, భాస్కర్, వీరేష్ పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాల పంపిణీ

వెల్దుర్తి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవా కేంద్రంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విత్తనాలను రైతులకు గురువారం పంపిణీ చేశారు. డీపీఎం చంద్రశేఖర్, ఏపీఎం అనురాధతో కలిసి మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రకృతి సేద్యం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

నియమాలు పాటించకుంటే చర్యలు

ఆదోని టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పశువధ శాలల్లో నియమాలు పాటించకుంటే చర్యలు తప్పవని మున్సిపాలిటీ హెల్త్ ఆఫీసర్ డా.సందీప్ అన్నారు. గురువారం పట్టణంలోని రెండు పశువధశాలలను పరిశీలించారు. పరిశుభ్రత పాటించకపోవడం, పశువుల వ్యర్థాలు, మలిన పదార్థాలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో, గర్భంతో ఉన్న, చిన్న పశువులను, వధించరాదని ఆదేశించారు. ఇకపై తరచుగా తనిఖీచేసి, నియామలు పాటించనని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత కుట్టు శిక్షణ

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని న్యాక్ ఇన్‌చార్జి బీజే ఉలుగన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 30మంది మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9908554147, 9397031486 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు వైద్య శిబిరం

ఆదోని టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న మల్లికార్జున విద్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మహర్షి విజయ్ కుమార్ తెలిపారు. కిమ్స్ వైద్యులచే గుండె, కిడ్నీ, చెవి, ముక్కు, ఎముకలకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను ఇస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని వినియోగించుకోవాలని కోరారు.

20న కంటి వైద్యశిబిరం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 20న ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కురువ బండయ్య, శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం మాట్లాడుతూ కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ సారధ్యంలో సాయిబాబా ఆలయంలో ఉంటుందన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మద్దికెర, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో లలిత సూచించారు. గురువారం రామ్‌నగర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. రోజూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసేందుకు ఎవరూ సహకరించవద్దన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి ఉన్నారు.

పరిష్కరించాలి

ఆదోని రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జనసేన అధ్యక్షుడు తాహేర్ వలి కోరారు. గురువారం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వారానికోసారైనా తాగునీరు వచ్చేలా చూడాలని, పనిచేయని పంపులకు మరమ్మతులు చేయించాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. వివరాల మేరకు.. పెసలబండ గ్రామానికి చెందిన నర్సరెడ్డి, కపటి గ్రామానికి చెందిన ఈడిగ హరిచంద్ర కర్ణాటక మద్యాన్ని మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని ఆరోగ్య సిబ్బంది నాగరాజు, చంద్రకళ, శేక్షావలి, సులోచన, ఝాన్సీ, రజిత కోరారు. గురు వారం పెద్దతుంబళం పీహెచ్‌సీ వద్ద ప్లకార్డులతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా సీహెచ్‌ఓలు ఏదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఈపిఎఫ్‌ఓను పునరుద్ధరించాలని, ఆయు ష్మాన్ భారత్ నియామకాల ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

కన్నుల పండువగా ఉరుసు

చిప్పగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భంభం సాహెబ్ ఉరుసు కన్నుల పండువగా సాగిది, గురువారం డాక్టర్ సయ్యద్ ఆరిఫుద్దీన్ హుమ్సా ఖాద్రీ గుర్రంపై ఊరేగించారు. భక్తులు పాల్గొని షంషీర్ ఉత్సవాన్ని తిలకించారు. ఎమ్మెల్యే విరుపాక్షి, సర్పంచ్ గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యురాలు ఎల్లంకి రజిని, బర్కే సుమలత పాల్గొన్నారు

తల్లికి పౌష్టికాహారం అవసరం


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఆదోని టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి పౌష్టికాహారం అవసరమని ఎల్‌జీ స్ట్రీట్ అంగన్‌వాడీ కేంద్రం సూపర్ వైజర్ స్వయం ప్రభ అన్నారు. గురువారం లంగర బావి వీధిలో సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భం దాల్చినప్పటి నుంచి, పుట్టిన పిల్లలకు రెండేళ్లు వచ్చే వరకు తల్లికి పౌష్టిక ఆహారం ఎంతో అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులకు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికా హారాన్ని ఇస్తున్నాయని అన్నారు. కార్యక్ర మంలో మహిళా పోలీస్ దివ్య, అంగన్వాడీ టీచరులు శారద, ఈరమ్మ, నగరత్న, సిబ్బంతి లక్ష్మి, కీర్తి, తాయమ్మ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రైమరీ గ్రాడ్యుయేషన్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిడ్డీస్ ఉన్నత పాఠశాల ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని రోషన్ పంక్షన్‌లో గురువారం నిర్వహించిన వేడుకను డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చిన్నప రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రమశిక్షణ కలిగి ఉండాలని, పెద్దలను గౌరవించే పద్ధతిని ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ప్రైమరీ గ్రాడ్యుయేషన్ సర్టిఫి కెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కూలీలు

ఉపాధి వేతనాలు ఇవ్వాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉపాధి వేతనాలను చెల్లించాలని కూలీలు డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండుటెండలో పని చేస్తున్న కూలీలకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. పనిదినాలను పెంచాలని, కనీస వేతనం రూ.700లు వచ్చేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మజ్జిగ ప్యాకెట్లు, నీటి వసతి, గడ్డపారలు ఇవ్వాలని కోరారు. అనంరతం అధికారులకు వినతి పత్రం సమర్పించారు. నరసన్న, దస్తగిరి, బొజ్జులు, గోపాల్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

కు.ని. ఆపరేషన్లకు ఏర్పాట్లు



పశువుల ఆసుపత్రిలో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో వీధికుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పశువుల ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేస్తున్న కు.ని. ఆపరేషన్ల థియేటర్, ఏసీ, నీటి సరఫరా వంటి వాటి ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తయిన వెంటనే వీధికుక్కలకు కు.ని అపరేషన్ల ప్రక్రియ ప్రారంభమవు తుందన్నారు. అనంతరం గుడికల్ చెరువుకు చేరుకొని చెరువుకు ఏర్పాటు చేస్తున్న బండ్ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట డీఈఈ నీరజ, ఏఈలు చంద్ర, మధన్‌లు ఉన్నారు.

మఠానికి రూ. లక్ష విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సరస్వతి బాయి అనే భక్తురాలు సంపూర్ణ సేవకు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును ఆమె అందజేశారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కౌతాళం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ రజనీ కాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 7836 మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందని, వీరందరూ తమ దగ్గరలోని రేషన్ డీలర్లు, గ్రామ వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్ల దగ్గర ఈకేవైసీ చేయించుకోవచ్చని తెలిపారు. ఈకేవైసీ చేసు కోనివారికి మే నెలలో రేషన్ రద్దు చేస్తామని తెలిపారు.

దళితుల అభివృద్ధే టీడీపీ ధ్యేయం

జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కోసిగి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దళితులకు ఇచ్చిన మాట ప్రకారం దళితుల అభివృద్ధికి కట్టుబడిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి అన్నారు. గురువారం కోసిగిలో దళితులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, మరోసారి సీఎం చంద్రబాబు రుజువు చేశారన్నారు. ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంతో కోసిగిలోని దళితులు కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి దళితులు రుణపడి ఉంటామని తెలిపారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, నాడిగేని చిన్నతాయన్న, సొట్టయ్య, కోడి ఉరుకుందప్ప, భవనాసి ముకురయ్య, పాలరాజు, గౌరవ బాలరాజు, చిన్న ఈరన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

డీలర్‌ను నియమించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుకుంట గ్రామానికి రెగ్యులర్ డీలర్‌ను నియమించాలని అఖిలభారతి-యువజన సమాఖ్య నాయకులు షఫి, గౌస్, బాషా డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ ప్రియదర్శినిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ డీలర్ లేకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేషన్ కొంతవరకు పంపిణీ చేసి బియ్యం అయిపోయాయని లబ్ధిదారులను వెనక్కి పంపుతున్నారన్నారు. రాత్రివేళల్లో బ్లాక్‌మార్కెట్‌లో రేషన్ బియ్యాన్ని విక్రయించుకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

స్మార్ట్ సోలార్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్ తయారీ



విద్యార్థులు తయారు చేసిన స్మార్ట్‌సోలార్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని ఎర్ర కోట సెయింట్ జాన్స్ ఇంజినీ రింగ్ కళాశాల ఈఈఈ చివరి సంవత్సరం విద్యార్థులు ఐవోటీ పరిజ్ఞానంతో స్మార్ట్‌సోలార్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్ విత్ సీసీ టీవీ సర్వైలెన్స్‌ను తయారు చేసినట్లు ప్రాజెక్టు విభాగ అధ్యాపకుడు చితాంబరయ్యశెట్టి తెలిపారు. గురువారం విద్యార్థులు ఐవోటీ పరిజ్ఞానంతో తయారుచేసిన స్మార్ట్‌సోలార్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్ విత్ సీసీ టీవీ సర్వైలెన్స్‌ను కళాశాల ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా చితాంబరయ్యశెట్టి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్, ఐవోటీ కనెక్టివిటీతో కూడిన స్మార్ట్ సోలార్ స్ట్రీట్‌లైటింగ్ సిస్టమ్ గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ఒక విప్లవాత్మక పరిష్కారం అన్నారు. దీనిద్వారా భద్రత పెరుగుతుందన్నారు. దీన్ని తయారుచేసిన విద్యార్థులను కళాశాల బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉల్లి రైతు విలవిల

● తగ్గిన ధరలు
● క్వింటం రూ.600 లోపే
● పొలాల వద్దే వ్యాపారులకు అమ్మకాలు



ధర లేకపోవడంతో పొలంలో వదిలి వేసిన ఉల్లిపంట

గోనెగండ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఉల్లి ధర తగ్గుముఖం పట్టడంతో ఉల్లి రైతులు విలవిలలాడుతున్నారు. కర్నూలు మార్కెట్‌లో క్వింటం ధర రూ.500 నుంచి రూ.1200 లోపే ధర పలుకుతుంది. నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. కనిష్ఠ ధర రూ. 500, గరిష్ఠ ధర రూ.1200 లోపే పలుకుతుంది. సరాసరి మీద ఉల్లి పంట క్వింటం రూ.600 మించి మార్కెట్లో ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌కు పోతే కనీస ధర కూడా పలకక పోవడంతో పాటు రవాణా ఖర్చులకు కూడా రావని తలచి ఇకచేసేది లేక రైతులు పొలాల దగ్గరనే వ్యాపారులకు క్వింటం ధర రూ.500 నుంచి రూ.600 లోపే విక్రయిస్తున్నారు. మరి కొంతమంది రైతులు ఆటోల్లో ఉల్లి బస్తాలను వేసుకొని గ్రామాల్లోని వీధుల్లో తిరుగుతూ రూ. 100కు ఆరు కేజీల ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారు. 50 కేజీ బస్తా రూ.750 నుంచి 850 అమ్ముతున్నారు. ఈఏడాది దిగుబడి కూడా సగానికి పైగానే పడిపోయింది ఎకరంలో 300బస్తాలు దిగుబడి రావాల్సి ఉం డగా 200 బస్తాలకు మించి దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు. మండలంలో ప్రస్తుతం దాదాపు 1000 ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ఎకరానికి పెట్టుబడి దాదాపు రూ.80వేల నుంచి రూ.90వేల వరకు వస్తుందని తెలిపారు. గోనెగండ్ల కు చెందిన బాషా అనే రైతు ఉల్లి పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక పోవడంతో ఇంటి దగ్గరే పంటను ఆరబెట్టుకున్నారు. నేడు రేపు ధర పెరుగుందనే ఆశతో ఉల్లి రైతులు ఉన్నారు.

రూ. 80వేలు పెట్టుబడి పెడితే..



ఉల్లి పంట సాగుకు రూ.80వేలు పెట్టుబడి పెట్టాం. తీరా పంట చేతికందే సమయానికి ధర కాస్త పడిపోయింది. మార్కెట్‌కు తీసకుపోతే రవాణాలు ఖర్చులు కూడా రావు. గ్రామంలోని వ్యాపారులకు క్వింటం ధర రూ.500కు అమ్మేశా. రూ. 30వేలు చేతికి వచ్చింది. పెట్టుబడి రూ.80వేలు కాగా రూ.50వేలు నష్టపోయా. పెట్టుబడి రాకపో వడంతో అప్పుల పాలు కావాల్సి వచ్చింది.

\- హాజీవలి, ఉల్లిరైతు, గోనెగండ్ల

ఆరుబయటే వంట

● మోడల్ స్కూల్‌లో వేధిస్తున్న వంట గది కొరత
● ఇబ్బందులు పడుతున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు



మోడల్ స్కూల్‌లో ఆరుబయటనే వంట చేస్తున్న నిర్వాహకులు

మంత్రాలయం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో ఆరుబయటే వంటలు చేస్తున్నారు. వంట గదిని ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాడు-నేడు కింద ఉన్న పాఠశాలలకే గదులు, మరమ్మతులు నిర్మించారు. అయితే.. ఈ మోడల్ స్కూల్‌కు వంట గది నిర్మించకపోవడంతో వంట నిర్వాహకులు ఎండకు వంటలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల వెనుకాల చిన్నపాటి రేకుల షెడ్డులో వంటలు చేస్తూ వస్తున్నారు. ఎండాకాలం కావడంతో రేకుల షెడ్డు వేడిమికి, కట్టెల పొయి వేడికి నిర్వాహకులు వంటలు చేయడం కష్టంగా మారింది. దీంతో ఆరుబయటనే వంట చేస్తూ విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఈ పాఠశాలకు వంట గ్యాస్‌ను మంజూరు చేయకపోవడంతో కట్టెలపోయి ద్వారానే పొగకు ఇబ్బందులు పడుతూ వంట ఏజెన్సీని నిర్వహించడం కష్టసాధ్యంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంట గదిని నిర్మించి, వంట గ్యాస్ మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

వారసత్వ ఉద్యోగాలు కల్పించాలి



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులు 60 సంవత్సరాలు పూర్తయిన వారికి వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మాస్టర్ పాయింట్ల దగ్గర సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడులు మాట్లాడుతూ మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులు 60 సంవత్సరాలు పూర్తయిన వారికి వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తూ గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని మాస్టర్ కేంద్రంలో సీఐటీయూ అధ్వర్యంలో ధర్నా నిర్వహించి ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చెస్తూ 62 ఏళ్ల సర్వీసును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో అనారోగ్య కారణాల వల్ల మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాగరాజు, ఇస్మాయిల్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డికి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మతోన్మాద వ్యతిరేక పోరాటమే జార్జి రెడ్డికి నిజమైన నివాళి అని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సామాన్య విద్యార్థిగా వచ్చి అక్కడ జరుగుతున్న దౌర్జన్యాలకు ఎదురునిలిచి విద్యార్థుకు అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో నరసింహరెడ్డి , హఫీజ్, నూరి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

గోనెగండ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు హరికృష్ణ, జ్యోష్న కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఎంఎల్ హెచ్‌పీలు సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. అనంతరం పుర వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలన్నారు. అలాగే పని ఆధారిత ప్రోత్సా హకాలను క్రమబద్ధీకరించి ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సీహెచ్‌వోలను మినహాయింపు ఇవ్వాలని అలాగే హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా పితృత్వసెలవులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రేష్మ, రాజేశ్వరి, సుశీ, సుశీల, తులసి పాల్గొన్నారు.

బీమా అందజేత

కౌతాళం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి అండగా విశాల సహకార సంఘం తరపున గురువారం రూ.2లక్షల ఆర్థిక సాయం నామినీకి గురువారం అందజేసినట్లు ఆ సంఘం పీఐఈ రామ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని సుళేకేరి గ్రామానికి చెందిన కటిక మాబుసాబ్ తమ సొసైటీలో వ్యవసాయ రుణంతో పాటు జనతా యాక్సిడెంట్ పాలసీని తీసుకున్నట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు గతేడాది నవంబరు 19న పొలంలో పనిచేస్తూ పాముకాటుకు గురై మృతిచెందాడు. మృతుడి యాక్సిడెంట్ పాలసీ ఉండ టంతో నామినీకి రూ.2 లక్షల చెక్కు మంజూరు కావడంతో ఆచెక్కును మృతుడి భార్య కటిక మాబీకి సంఘం తరపున అందజేశామ న్నారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ వెంకటేశ్వర్లు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఎంహెచ్ కౌన్సిలర్ జనార్దన్‌రాజు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలకు, మార్కులకే ప్రాధాన్యత ఇవ్వకూడదని జీవిత లక్ష్యంతో ముందుకు సాగాలని సీఎంహెచ్ కౌన్సిలర్ జనార్ధన రాజు అన్నారు. గురువారం పట్టణంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాల యంలో ఎమ్మిగనూరు, చిలకలడోన, నందవరం, పెద్దకడుబూరు ప్రాంతాలకు చెందిన కేజీబీవీ 10తరగతి విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీసీడీఓ స్నేహాలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఒక పరీక్ష జీవితాన్ని నిర్వచించదని, ఓటమి తరువాత తిరిగి పుంజుకోవటమే నిజమైన శక్తి అని పేర్కొన్నారు. విద్యార్థినులకు స్ఫూర్తిదాయకమైన కథలు, రోల్ మోడల్ సెషన్ల ద్వారా ప్రేరణ కలిగించారు. కార్యక్రమంలో ఆయా విద్యాలయాల ఎస్‌ఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఖాదర్‌బాషా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా తోటి ఉపాధ్యాయులు రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం, ఎస్టీయు ఎమ్మిగనూరు తాలూకా పరిధిలోని గల ఉపాధ్యాయులు సహకారంతో ఎస్టీయూ నాయకులు సేకరించిన రూ. లక్షను అందజేశారు. త్వరగా కోలుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రసన్న రాజు, బాబయ్య, అడివన్న పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● పార్టీలో పనిచేసిన వారికి సముచితస్థానం
● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, పట్టణంలో చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కుర్ణికమ్యూనిటి హాల్‌లో టీడీపీ సంస్థాగత కమి టీల నియమాక సమావేశాన్ని పార్టీ పరిశీలకులు శ్రీరాములు ఆద్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా మొదటి రోజు పట్టణంలోని ఆరో వార్డు నుంచి 17వార్డు వరకు కమిటీలను నియమించగా, 9, 10వ వార్డు కమిటీలు నియమాకం వాయిదా పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు, ఎన్నికల తరువాత పార్టీకోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే ఆయా వార్డుల్లో ఉన్న నాయకులను గుర్తించి పదవు లకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ సాధికారిక సభ్యులు స్థానికంగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆయా వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): ఏపీ హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోషియేషన్) ఎమ్మిగనూరు తాలుకా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘుబాబు, సయ్యద్ షఫీ ఆద్వర్యంలో సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం తాలుకా అధ్యక్షులుగా జగదీష్, కార్యదర్శిగా ఎండీ రఫీక్ అలీ, ట్రెజరర్‌గా నాగన్నగౌడ్, అసోషియేట్ ప్రసిడెంట్‌గా రామకృష్ణయ్య, ఆర్గనై జింగ్ సెక్రటరీగా రత్నయ్య శెట్టి, జాయింట్ సెక్రటరీగా వెంకటరామయ్య, రజని, ఉపాధ్యక్షులుగా లక్ష్మన్న, ఆనందరాజు, మహిళా సెక్రటరీగా సిరాజున్నీసా బేగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ సం ఘం ఆధ్వర్యంలో సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక కమిటి నాయకులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సందీప్, త్యాగరాజు, నాగన్న పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



మంటలను ఎలా అదుపు చేయాలని అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను ఎలా నివారించవచ్చు విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మిగనూరు కేంద్రం అధికారి అంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్థానిక వీవర్స్ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అంజనేయులు మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుండి ఏప్రిల్ 20 వరకు జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా మంటలను ఎలా అదుపు చేయాలి? ఎలా ఆర్పాలి? అని డెమో ద్వారా చేసి చూపించారు. గ్యాస్ సిలిండర్‌లో రెగ్యులేటర్ దగ్గర గ్యాస్ నిలుపుదల చేయాలని దానికున్న పైపుపై ఎక్స్‌పైరీ తేదీని చూసి వాడుకోవాలన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు తడి బట్టతో కూడా ఎలా ఆర్పాలో, తీసుకోవలసిన జాగ్రత్తలేవో అవగాహన కల్పించారు.

రోడ్డుపైనే మురుగు

● నిండిన మ్యాన్ హోల్
● ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు



రాధాకృష్ణ కాలనీలో యుజీడీ మ్యాన్ హోల్ నుంచి రోడ్డుపైకి వచ్చిన మురుగు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాధాకృష్ణ కాలనీలో యూజీడీ మ్యాన్‌హోల్ నిండి రోడ్డుపైకి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో ఉన్న మొదటి లైన్‌లో యూజీడీ మ్యాన్‌హోల్ ఏర్పాటు చేశారు. గతంలో మ్యాన్‌హోల్ ద్వారా నీరు దిగువకు వెళ్లేవి. అయితే ఇటీవల మ్యాన్ హోల్‌లో పూడిక పేరుకుపోయి మురుగునీరు కాస్త సీసీరోడ్డుపైకి వస్తున్నాయి. అదే ప్రాంతంలో కొన్ని చోట్ల వర్షాకాలంలో యూజీడీ మ్యాన్ హోల్స్ నుంచి పొంగి ఇళ్లలోకి వెళ్తున్నట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. మ్యాన్‌హోల్స్‌ను సంబంధిత సిబ్బంది పర్యవేక్షించక పోవటం, పూడిక తీయకపోవటంతో మ్యాన్‌హోల్స్ నిండి మురుగునీరు కాస్తా సీసీ రోడ్డుపైకి వస్తున్నాయి. మురుగునీరు దుర్గంధం వెదజల్లుతుండటం, నీటిపై దోమలు నిలుస్తుండటంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మునెప్ప నగర్‌లో సైతం మురుగు కాలువలను శుభ్రం చేయకపోవటంతో మురుగునీరు ముందుకు కదలటం లేదు. మురుగునీరు నిలిచి కాలువపై పొంగి ప్రవహిస్తున్నాయి. కాలువలు శుభ్రం చేయకపోవటంతో దుర్గంధం వెదజల్లడమే గాక దోమలు, ఈగలు వాలుతున్నాయి. గుడికల్ రోడ్డులో ప్రధాన రహదారి పక్కనున్న డ్రైనేజీ నిండి ప్రవహిస్తోంది. శుభ్రం చేయాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



మునెప్ప నగర్‌లో పూడికతీతకు నోచుకోని మురుగు కాలువ